క్లుప్తంగా

రోడ్డు వేశారు



నూతనంగా వేసిన సీసీరోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: చిన్న బుచ్చి రాజుపాలెం నుంచి జయప్రకాష్‌నగర్‌కు వెళ్లే రహదారి బాగు పడింది.రోడ్డు అధ్వానంగా ఉండడంతో స్థానికుల ఇబ్బందులపై సాక్షిలో ప్రమాదకరంగా యూజీడీ మ్యాన్‌హోల్స్ అనే శీర్షికతో వార్త ప్రచురితమయింది. అధికారులు స్పందించి వెంటనే సీసీ రోడ్డు వేశారు. దీంతో స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

సేవా కార్యక్రమాలతో గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న మౌర్యసింహా

మల్కాపురం: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ(శ్రీహరిపురం) యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం శ్రీహరిపురంలోని ఆ సంస్థ భవనంలో నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని మౌర్య సింహా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేసి పలువురికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. వ్యవస్థాపక చైర్మన్ ఎస్.రామచంద్రా రెడ్డితో సభ్యులు పాల్గొన్నారు.

16న మర్రిపాలెంలో నడక పోటీలు

విశాఖ విద్య: మర్రిపాలెం వుడా లే అవుట్ గ్రీన్ బెల్ట్ పార్కులో ఈ నెల 16న ఉదయం 7.30గంటలకు నడక పోటీలు నిర్వహిస్తున్నట్లు హెల్దీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. నాగేశ్వరరావు తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎటువంటి ఎంట్రీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. నడక వల్ల కలిగే ఆరోగ్య పరమైన ప్రయోజనాలు అందరికీ చాటిచెప్పేందుకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పేర్లు నమోదుకు 7780501078, 7799970044, 9700367031 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కార్పొరేటర్ చిన్నాకు సన్మానం



కార్పొరేటర్ చిన్నాను సత్కరిస్తున్న చర్చి నిర్వాహకులు

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు జైఆంధ్రాకాలనీలోని ఇమ్మానుయేల్ ప్రేయర్ ఫెలోషిప్ చర్చి నిర్వాహకులు వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నాను ఆదివారం ఘనంగా సత్కరించారు. గ్రామ అభివృద్ధి కోసం చిన్నా చేస్తున్న సేవలను గుర్తించి సత్కరించినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ లాజరస్, నాయకులు బాబూరావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

గీత కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వాలి

పెదగంట్యాడ: కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన లిక్కర్ పాలసీలో గీత కార్మికులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని గీత సహకులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు కోరారు. ఈ మేరకు సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం పాలసీలో గీత కులాలకు చెందిన సొసైటీలకు కేటాయించిన 10 శాతం రాయితీని 20 శాతానికి పెంచాలన్నారు. అలాగే టెండర్ల కోసం చెల్లించే రూ.2 లక్షలను గీత కులాలకు చెందిన సొసైటీలకు రిఫండబల్‌గా నిర్ణయించాలని ప్రభుత్వానికి విన్నవించారు.

గ్రీన్‌బెల్ట్ ఆక్రమణ



గ్రీన్‌బెల్ట్‌లో ఏర్పాటు చేసిన దుకాణం



గ్రీన్ బెల్ట్ స్థలంలో వేసిన సిమెంట్ కాంక్రీట్

- కాకానినగర్‌లో వెలసిన దుకాణాలు
- దర్జాగా రోడ్డు వేసిన వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు

విశాఖ విద్య: ఖాళీ స్థలాలపై కన్నేసి ఆక్రమణలకు సిద్ధమవుతున్న కూటమి నేతలు చివరకు గ్రీన్ బెల్ట్‌ను సైతం వదిలిపెట్టడం లేదు. ఎన్ఏడీ జంక్షన్‌కు సమీపంలోని కాకానినగర్ వద్ద గ్రీన్ బెల్ట్‌ను దర్జాగా ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. అంతటితో ఆగకుండా దుకాణాలు విస్తరణ కోసం సొంతగా రోడ్డు వేసుకోవడం గమనార్హం. హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్‌లో సుమారు 60 గజాల మేర స్థలం ఆక్రమించి దుకాణం పెట్టుకునేందుకు సిమెంటు కాంక్రీట్‌తో పటిష్టమైన ఏర్పాట్లు చేసుకున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి ఎన్ఏడీ సెంటర్‌కు వచ్చే దారిలో కాకానినగర్ ట్రాఫిగ్ సిగ్నల్‌కు కూతవేటు దూరంలో ఆక్రమణ పర్వం సాగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంలో మర్మం ఏంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

కూటమి నేతల అండతోనే

90వ వార్డుకు చెందిన కూటమి నాయకుల అండదండలతో ఆక్రమణలు జరుగుతుండడంతో అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. ఎయిర్ పోర్టు నుంచి నగరంలోని వచ్చే దారిలో హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్‌ను సుందరంగా తీర్చిదిద్దేందుకు జీవీంఎసీ అధికారులు ప్రత్యేక నిధులు వెచ్చిస్తున్నారు. ఇదే క్రమంలో గ్రీనరీ పెంచేందుకు శ్రద్ధ తీసుకున్నారు. కానీ గ్రీన్ బెల్ట్‌నే ఆక్రమించినా 90వ వార్డుకు చెందిన జీవీఎంసీ అధికారులు చోద్యం చూస్తుండడం గమనార్హం. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను ప్రేరేపిస్తూ కూటమి నాయకులు పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారనే ప్రచారం సాగుతోంది.

మౌనమెందుకో!

గ్రీన్ బెల్ట్‌లో దుకాణం ఏర్పాటు చేసి కాంక్రీట్‌తో పటిష్టమైన ఏర్పాట్లు చేసినా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. రహదారికి ఆనుకొని చేపట్టిన ఈ నిర్మాణం అధికారులు కనిపించకపోవడంలో ఆంతర్యమేమిటో తేలాల్సి ఉంది. జీవీఎంసీకి చెందిన కొంతమంది అధికారులు ఆక్రమణదారులతో లోపాయికారీ ఒప్పందాలు చేసుకోవడం వల్లే ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండాపోతుందని ఈ ప్రాంతవాసులు అంటున్నారు. జీవీఎంసీ కమిషనర్ ఇక్కడ జరుగుతున్న ఆక్రమణలపై దృష్టి సారిస్తే దీనిలో భాగస్వామ్యులైన అధికారుల గుట్టు రట్టయ్యే అవకాశం ఉందని కాకానినగర్ కాలనీ వాసులు అంటున్నారు.

కమిషనర్ గారూ పట్టించుకోండి

ఎయిర్‌పోర్టు నుంచి నిత్యం నగరంలోకి వీఐపీలు వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఎన్ఏడీ సెంటర్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు హైవేకు ఇరువైపులా ఎటువంటి ఆక్రమణలు జరుగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది. కానీ కూటమి నేతల కనుసన్నల్లో సాగుతున్న ఆక్రమణల పర్వంపై స్థానిక అధికారులు కళ్లకు గంతలు కట్టుకుంటున్నారా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. జీవీఎంసీ కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గ్రీన్‌బెల్ట్‌ను ఆక్రమణదారుల చెర నుంచి కాపాడాలని పర్యావరణ ప్రియులు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలు



గాయపడిన లీలాప్రసాద్‌ను ఆటోలో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



తలకు గాయమైన సింహాచలం

మల్కాపురం: స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు ప్పింది.ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తితో పాటు వెనుక కూర్చున వ్యక్తికీ గాయాలయ్యాయి. వివరాలు.. శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన పునుకు సింహాచలం, పునుకు లీలాప్రసాద్ కోరమాండల్‌లో కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్నారు. ఓ శుభకార్యక్రమానికి ఆదివారం వారు ఇద్దరూ ద్విచక్ర వాహనంపై నగరానికి వెళ్లారు. అక్కడ భోజనం చేసి తిరిగి వస్తుండగా మధ్యాహ్నం 3 గంటల సమయంలో మల్కాపురం కేంద్రీయ విద్యాలయం సమీపంలోని స్పీడ్ బ్రేకర్ దాటే క్రమంలో వాహనం అదుపు తప్పింది. దీంతో వారికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి ప్రమాదంపై విచారించారు. గాయపడిన సింహాచలం, లీలాప్రసాద్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

కారును ఢీకొన్న లారీ

ముగ్గురికి గాయాలు



డివైడర్ పైకి దూసుకుపోయిన కారు



ప్రమాదంలో కాలు విరిగిపోయిన అనురాధ

అగనంపూడి: కారును వెనుక నుంచి లారీ ఢీకొట్టిన సంఘటనలో మహిళకు కాలువిరగిపోగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగదాంబ ప్రాంతానికి చెందిన ఐఎంరావు కుటుంబ సభ్యులు అనురాధ, సుజాతలతో కలిసి కారులో కొవ్వూరు వెళ్తున్నారు. అగనంపూడి సెక్టార్-1 కాలనీకి ఎదురుగా వచ్చేసరికి కారును వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో కారు డివైడర్ పై నున్న వీధి దీపాల స్తంభాన్ని ఢీకొట్టి డివైడర్ పైకి దూసుకుపోయింది. దీంతో అనురాధ ఎడమ కాలు విరిగిపోయింది. మిగిలిన ఇద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వీరిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

దాండియా నృత్యాలు అదరహో



నృత్యాలు చేస్తున్న మహిళలు

విశాఖ విద్య: దసరా ఉత్సవాల్లో దాండియా నృత్యాలు కనువిందు చేయడమే కాకుండా స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తాయని సుధా మాధురి అన్నారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 52 వ వార్డు మర్రి పాలెం వుడా లేఅవుట్ అమేజింగ్ ఏంజిల్స్ అండ్ పెట్టీ కిట్టీ లేడీస్ ఆధ్వర్యంలో ఆదివారం దాండియా కోలాట ప్రదర్శన అట్టహాసంగా నిర్వహించారు. కాలనీ మహిళలంతా ఒకచోట చేరి ఆటపాటలతో అలరించారు. నత్యాలతో హోరెత్తించారు. యువత, చిన్నారులు అమ్మవారి ఆధ్యాత్మిక గీతాలకు సాంప్రదాయ వేషధారణల్లో చేసిన కోలాటం ఆద్యంతం అలరించింది. కార్యక్రమంలో వరలక్ష్మి, నాగలక్ష్మి, భాను, సాయిశ్రీ, సుజాత, స్వప్న, శిల్ప, లక్ష్మి, సరిత, శ్రావణి, మీనా, శ్రీదేవి, హరిప్రియ, జశ్రిత, సాన్విక తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు



జయప్రకాష్‌నగర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



అమ్మవారి సారెతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు



గాజువాక ఆర్టీసీ డిపో వద్ద లలితాత్రిపురసుందరిగా దుర్గమ్మ



ములగాడ వద్ద పూజలు అందుకుంటున్న దుర్గమ్మ



కొత్తపాలెంలో లలితాత్రిపుర సుందరిగా విజయదుర్గ



దుర్గానగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



ఏఎస్సార్ కాలనీలో అమ్మవారికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

మల్కాపురం: దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం దుర్గమ్మ లలితా త్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. భక్తులు చీర, సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

- గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలోని విజయదుర్గా ఆలయంలో కొలువుదీరిన అమ్మవారిని లలితా త్రిపురసుందరిగా అలంకరించారు. గాజులతో పూజ నిర్వహించారు.మహిళలు పెద్ద ఎత్తున గాజులు తీసుకు వచ్చి అమ్మవారి పాదల ముందు ఉంచి పూజలు చేశారు. దానిమ్మ పండ్లు,చక్కెర పొంగలిని నైవేద్యంగా సమర్పించారు. గులాబీ,సంపంగి,సన్నజాజి పూలతో పూజలు చేశారు. గాజువాక ఆర్టీసీ డిపో ఎన్ఎంయూ ప్రధాన కార్యదర్శి పి.శంకరరావు దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.
- 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి వద్ద డేరింగ్ అండ్ డేషింగ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో దుర్గమ్మను లలితాదేవి అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.
- 58వ వార్డు చిన్న ములగాడలోని దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామపెద్ద నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.
- 58వ వార్డు శ్రీహరిపురం దరి కుంచమ్మకాలనీలో దుర్గా గణేష్ యూత్ ఆధ్వర్యంలో దుర్గమ్మతల్లికి ప్రత్యేక పూజలు జరిగాయి.ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు.

దుర్గానగర్‌లో ..

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి దుర్గానగర్‌లో వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం కుంకుమ పూజలు నిర్వహించారు. దుర్గాదేవిని లలితా త్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. 9న భారీ అన్నదానం, 13న అమ్మవారి ఊరేగింపుతో నిమజ్జన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకుడు వానపల్లి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో హేమంత్‌సాయి, మణివర్ధన్, మనోజ్‌కుమార్, వి. సుప్రజ, రమ్యశ్రీ పాల్గొన్నారు.

శరణు.. శరణు దుర్గమ్మ

గోపాలపట్నం: కొత్తపాలెం దుర్గాదేవి ఆలయంలో లలితా సహస్రనామ పారాయణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- జయప్రకాష్‌నగర్‌లో దుర్గా దేవి శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన మండపంలో విశేష పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు.
- కొత్తపాలెం గణపతినగర్‌లో అమ్మవారికి సారె ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఉన్న మహిళలు మిఠాయిలు, పలు పండ్లను ఊరేగిస్తూ అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, డీకేఫౌండేషన్ వ్యవస్థాపకుడు దొడ్డి కిరణ్ దంపతులు , మండప కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని త్రినాథపురం, ఏఎస్సార్‌కాలనీలో దుర్గాదేవిని ఆదివారం వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్లపై దుకాణాలు.. తప్పని తిప్పలు

నిత్యం ట్రాఫిక్ జామ్



మల్కాపురం నుంచి సింధియా వెళ్లే రోడ్డులో ఏర్పాటు చేసిన దుకాణాలు



మల్కాపురం పోలీస్‌స్టేషన్ ఎదురు రోడ్డులో పార్కింగ్ చేసిన వాహనాలు

సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో శ్రీహరిపురం నుంచి సింధియా వరకు రోడ్లపై విచ్చలవిడిగా దుకాణాలు వెలిశాయి. శ్రీహరిపురం, మల్కాపురం , సింధియా జంక్షన్ వరకు రోడ్డుకు ఇరుపైపులా ఇబ్బడి ముబ్బడిగా తోపుడు బళ్లు పెడుతున్నారు. కొనుగోలుదారులతో ఆ రోడ్లు నిత్యం రద్దీగా మారుతున్నాయి. ఫలితంగా తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రధాన రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేయడంతో వాహనాలు సైతం పార్కింగ్ చేసకోవడానికి చోటు లేక వాహనచోదకులు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. సెలవు రోజుల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది.

మార్కెట్‌లో వెళ్లకుండా

జీవీఎంసీ అధికారులు రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు చేస్తున్న వారిని ఖాళీ చేయించి మార్కెట్‌లో దుకాణాలు ఇచ్చిన వారంతా అక్కడికి వెళ్లడం లేదు. రోడ్లపైనే వ్యాపారాలు సక్రమంగా సాగుతున్నాయంటూ అక్కడే ఉండడంతో సమస్యలకు పరిష్కారం లభించడంలేదు. దీంతో కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డలోనే కోరమాండల్, హెచ్‌పీసీఎల్ సంస్థలకు వచ్చే భారీ వాహనాలు సైతం పార్కింగ్ చేసి రోజుల తరబడి ఉంచడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రోడ్లపై వ్యాపారాలు సాగిస్తున్న వారికి అవగాహన కలిగిస్తున్నా వారు మారడం లేదని అధికారులు తలలు పటుకుంటున్నారు.

చట్టాలతో బాధితులకు మరింత మేలు

దాబాగార్డెన్స్ : చట్టాలు మరింత సులువుగా మారాయని, ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలతో ఫిర్యాదుదారులకు కొంత మేలు జరగనుందని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్యాంప్రసాద్, విశాఖపట్నం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు పేర్కొన్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏ స్టేషన్ పరిధిలో నేరం జరిగితే ఆ స్టేషన్‌లోనే ఫిర్యాదు చేయాల్సి ఉండేదని, ప్రస్తుతం ఆ పరిస్థితిలో మార్పు వచ్చిందన్నారు. జీరో ఎఫ్ఐఆర్ అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. ఎవరైనా భూమిని ఆక్రమిస్తే సివిల్ కేసు కింద కోర్టుని ఆశ్రయించవచ్చని చెప్పారు. మహిళలపై వేధింపులు, లైంగిక దాడుల కేసుల గురించి వివరించారు. అనంతరం మానవ హక్కుల న్యాయస్థానాలు, ప్రాథమిక పాత్రపై వివరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది లక్ష్మీ రాంబాబు, హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఎస్‌వీ రమణ, గుండు అప్పలరాజు పాల్గొన్నారు.

ఆటో చార్జీలు అధికంగా వసూలు చేస్తే చర్యలు

- సౌత్ ట్రాఫిక్ సీఐ వెంకటరావు
- చార్జీల వివరాలు తెలిపేలా బోర్డు ఏర్పాటు చేయాలని సూచన

అగనంపూడి: రైల్వే ప్రయాణికుల నుంచి నిబంధనల మేరకు, సహేతుకంగా ఉండేలా చార్జీలు వసూలు చేయాలని సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిల్లి వెంకటరావు సూచించారు. చార్జీల విషయంలో ప్రయాణికులను ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దువ్వాడ రైల్వేస్టేషన్ ఆటో స్టాండ్ డ్రైవర్లకు ఆదివారం రహదారి నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటో చార్జీలు అధికంగా వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుల మేరకు ఆయన డ్రైవర్లకు సూచనలు చేశారు. నిబంధనలు అతిక్రమించి వసూలు చేయరాదని, ఆటో చార్జీలు తెలుపుతూ స్టాండ్ వద్ద చార్జీల వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మరోసారి చార్జీల విషయంలో ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. అలాగే డ్రైవర్లు రోడ్డు నియమాలు, నిబంధనలు పాటిస్తూ ఆటోలు నడపాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నవ్వులు పంచిన 'వినోదాల విందు'

సీతంపేట : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నిర్వహించిన 'వినోదాల విందు' కార్యక్రమం ఆద్యంతం నవ్వులు పూయించింది. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం కళాకారులు ఉత్సాహంగా పాల్గొని పలు కామెడీ స్కిట్స్ ప్రదర్శించి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. వీటిలో డ్రైవర్ ఉద్యోగం, పండగకి వస్త్రా, నైటీ, 6 నెలలు, పెళ్లాం కంట్రోల్, పక్కింటి ఆంజనేయులు, పెళ్లి చూపులు, దెయ్యాలు, ఫ్రిజ్ స్కిట్స్ ఆహూతు లను అలరించాయి. కళాకారులు ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, అడవి రాజు, భాను, రాజు, నాయుడు, పోర్టు శేషు, మల్లిక, శంకర్ స్కిట్స్ ప్రదర్శించా రు. అనంతరం కళాకారులను నందూరి రామకృష్ణ, తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, డి.నాగ రాజారావు సత్కరించారు.

టీడీపీ, జనసేన అధినేతలు నోరు విప్పాలి



దీక్షా శిబిరంలో పాల్గొన్న పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడడానికి కూటమి ప్రభుత్వ పెద్దలు కదలిరావాలని సీపీఎం నాయకుడు సీహెచ్.నరసింగరావు కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెంలో ఆదివారం చేపట్టిన 1333వరోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని నోరు విప్పాలన్నారు. ఉక్కు యాజమాన్యం కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు గండికొడుతున్నా, డిప్యుటేషన్ల పేరుతో బెదిరిస్తున్నా నోరు మెదపకోవడం చూస్తుంటే కూటమి నేతల తీరు అనుమానాలకు తావిస్తుందన్నారు. చిత్తశుద్ధి ఉంటే వెంటనే విశాఖ ఉక్కు పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అయోధ్యరామ్, ఆదినారాయణ, రామారావు, పైడిరాజు, రామ్మోహన్‌కుమార్, జె.రామకృష్ణ, మహాలక్ష్మినాయుడు, కోమటి శ్రీనివాసరావు, జెర్రిపోతులు ముత్యాలు, వై.టి.దాస్, రమణమూర్తి, ప్రసాద్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

పోర్టు నిధులతో ఆస్పత్రిని నిర్వహించాలి



పోర్టు హాస్పిటల్ వద్ద రిలే నిరాహారదీక్షలో నాయకులు

తాటిచెట్లపాలెం : సాలగ్రామపురంలోని విశాఖపట్నం పోర్టు అథారిటీ హాస్పిటల్‌ను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు కొనసాగిస్తున్న రిలే నిరాహారదీక్షలు ఆరో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు కె.సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర మంత్రి సర్బానంద్ సోనోవాల్ ప్రకటించిన విధంగా పోర్టు ఆస్పత్రిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లాభాల్లో నడుస్తున్న పోర్టు నిధులతో ఆస్పత్రిని నిర్వహించాలని కోరారు. వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిటు నాయకులు జెసత్యనారాయణ, త్రినాథ్, శంకర్రావు, జేడీ లక్ష్మి, నర్సింగరావు, ఈశ్వర్రావు, నాయుడు పాల్గొన్నారు.